నేడు మణికొండలో ఎమ్మెల్యే పర్యటన

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మొత్తం రూ.5.50 కోట్ల పనులను ఆయన ప్రారంభిస్తారన్నారు. మున్సిపాలిటీలో నెక్నాంపూర్, పుప్పాలగూడ, నెమలినగర్ బస్తీ దవాఖానాలను ఆయన ప్రారంభిస్తారన్నారు. పార్కుల ప్రారంభోత్సవం, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా


ఎండీ.సల్మాన్

శంషాబాద్ రూరల్: ఎన్ఎస్‌యూఐ రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకుడు ఎండీ.సల్మాన్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. 12 ఏళ్లుగా పార్టీకి పని చేసి ఇప్పుడు వీడడం బాధగా ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీ గ్రూపు రాజకీయాలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర


జాతరలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: మానసహిల్స్ గుట్టపై రెండు రోజులుగా కొనసాగిన సమ్మక్క సారలమ్మ జాతర గురువారం ముగిసింది. భక్తులు సమ్మక్క సారలమ్మలకు బంగారం మొక్కుగా చెల్లించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి సమ్మక్క సారలమ్మలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


భగవత్‌గూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ అర్చన

రాజేంద్రనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ వెల్లడించారు. బుద్వేల్ భగవత్‌గూడ ప్రాంతంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..దశల వారీగా అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, రాందాస్, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, మధు, డి.ప్రవీణ్, పి.బాల్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను.. అభివృద్ధికి దన్ను

- నార్సింగిలో ఐదింతలు పెరిగిన రాబడి
- మణికొండలో పన్నులు డబుల్
- వసూళ్లలో వేగం పెంచిన సిబ్బంది


నార్సింగి మున్సిపాలిటీలోని నివాసాలు


మణికొండ మున్సిపాలిటీలోని నివాసాలు


పన్నులు వసూలు చేస్తున్న మణికొండ అధికారులు

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు పన్నుల ఆదాయంలో అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ప్రతి సంవత్సరం నివాసాలు పెరిగిపోతుండటంతో అదే స్థాయిలో పన్ను రాబడి పెరుగుతోంది. మార్చి నెలాఖరుకు మున్సిపాలిటీలకు కోట్లాది రూపాయల పన్ను ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ నగరానికి, ఐటీ జోన్‌ను ఆనుకుని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు ఉన్నాయి. దీంతో జంట మున్సిపాలిటీల పరిధిలో ఐటీ, రాజకీయ, వ్యాపార, ఉద్యోగ, సినిమా రంగాల వారు నివాసముంటున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ప్రజలు ఇక్కడకు వచ్చి ఉంటున్నారు. దీంతో నిర్మాణరంగానికి ఊతం వచ్చి భూములు, ఫ్లాట్‌ల ధరలు పెరిగిపోయాయి. ఏకంగా ఎకరం రూ.50 నుంచి వంద కోట్లు, ఫ్లాట్ రూ.కోటి నుంచి రూ.5కోట్ల వరకు చేరుకుంది. భూ విలువను బట్టి ఏకంగా 36 నుంచి 55 అంతస్తుల ఎత్తులో టవర్‌ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అదే స్థాయిలో వ్యక్తిగత గృహాలు, విల్లా ప్రాజెక్ట్‌లు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో స్థానిక నిధులతోనే పార్కులు, రోడ్లు, కమ్యూనిటీహాళ్లు, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ లైన్లు, వీధి దీపాలు, కూడళ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆస్తి వారి పేర్లతో నమోదు కాగానే వెంటనే ఆన్‌లైన్‌లో ఆటోమెటిక్‌గా పన్ను జనరేట్ అవుతుంది. దీంతో మున్సిపాలిటీ సిబ్బంది, అధికారులపై పని భారం తగ్గిపోయింది.

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో..

2020-21 సంవత్సరానికి 9.93 కోట్లకు గాను 7.32 కోట్ల పన్నులు వసూలయ్యాయి. 2021-22 సంవత్సరానికి రూ.15.05కోట్లకు గాను రూ.14.60 కోట్లు ఆదాయం సమకూరింది. 2022-23 సంవత్సరంలో రూ.24.45 కోట్లకు గాను రూ.20.81కోట్లు.. 2023-24 సంవత్సరంలో 34.33కోట్లకు గాను రూ.26.60కోట్లు.. 2024-25 సంవత్సరానికి గాను రూ.48.63 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు రూ. 26.44 కోట్లు వసూలు అయి 54.38 శాతానికి చేరింది.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో..

2020-21 సంవత్సరానికి రూ.27.92 కోట్లకు గాను రూ. 19.55కోట్లు వసూలు అయ్యాయి. 2021-22 సంవత్సరానికి రూ. 37.23 కోట్లకు గాను రూ.26.38 కోట్లు.. 2022-23 సంవత్సరానికి రూ.44.31కోట్లకు గాను రూ.33.14కోట్లు.. 2023-24 సంవత్సరంలో రూ.54.15కోట్లకు రూ.37,58కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుత 2024-25 సంవత్సరానికి డిమాండ్ రూ. 69.31 కోట్లు ఉండగా గురువారం వరకు రూ. 33.01 కోట్లు 47.63 శాతం మాత్రమే వసూలు అయ్యాయి.

ఇప్పటి వరకు 47.63 శాతం వసూలు



“మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లతో మున్సిపల్ ఆదాయం భారీగా పెరిగింది. ఆస్తి పన్ను వసూలుకు సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారు. ఇప్పటి వరకు 47.63 శాతం వసూలయ్యింది. మార్చి నెలాఖరు వరకు 95 శాతం వసూలు చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రజలు సకాలంలో పన్ను చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని గమనించాలి.”

– ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

పన్నులతోనే ప్రగతి..



“వసతుల కల్పన, సమస్యలు సకాలంలో తీరాలంటే ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించాలి. అప్పుడే ప్రగతి వేగంగా జరుగుతుంది. ఈ విషయాన్ని గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల వారీగా క్యాంపులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 54.38 శాతం వసూలయ్యింది. మార్చి నెలాఖరు వరకు 95 శాతానికిపైగా వచ్చేలా కృషి చేస్తున్నాం. ఆలస్యంగా పన్నులు చెల్లిస్తే జరిమానాలు ఉంటాయన్న విషయాన్ని ప్రజలు గమనించాలి.”

– టి.కృష్ణమోహన్‌రెడ్డి , కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

దుర్గానగర్ జంక్షన్‌లో అధికారుల పర్యటన



మైలార్‌దేవ్‌పల్లి: దుర్గానగర్ జంక్షన్ పరిసరాలను గురువారం ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించారు. రోడ్డు మధ్యలో ఉన్న డ్రైనేజీ లైన్‌ను సైడ్ నుంచి వేసేందుకు జీహెచ్‌ఎంసీ ఈఈ నరేందర్‌గౌడ్, ఏఈ నర్సింహమూర్తితో కలిసి రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ పర్యటించారు. డ్రైనేజీ లైన్‌ను డెవలప్‌మెంట్ చేసేందుకు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఉన్న యూటర్న్ సమస్యపై ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ సమీక్షించారు. వాహనాదారులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ఆర్థిక సాయం


విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న రెడ్డి ఫౌండేషన్ నాయకులు

మణికొండ: పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఫీజు కట్టలేని పరిస్థితిని తెలుసుకుని మణికొండ రెడ్డి ఫౌండేషన్ నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మణికొండ మున్సిపాలిటీకి చెందిన సిరి పూర్ణ యూనిసెంట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. పదో తరగతి ఫీజు చెల్లించే ఆర్థిక పరిస్థితి లేకపోవటంతో చదువును మధ్యలోనే నిలిపివేయాలని నిర్ణయించుకుంది. విషయాన్ని తెలుసుకున్న రెడ్డి ఫౌండేషన్ నాయకులు విద్యార్థినికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఫౌండేషన్ నాయకులు సుభాష్‌చంద్రరెడ్డి, బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రాధా, సైదిరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, బి. శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వయం పాలన దినోత్సవం



మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని దుర్గానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుజాత అన్నారు. పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని, ఉపాధ్యాయుల పాత్రను స్వయంగా నిర్వహిస్తూ విలక్షణమైన అనుభవాన్ని పొందారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ..నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రధానమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జేఈఈలో గురుకుల బాలికల సత్తా

లక్ష్మీకాపూల్: జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో గండిపేట నార్సింగి సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాల బాలికలు తమ ప్రతిభను కనబరచారు. కళాశాల నుంచి 39 మంది మెయిన్స్ రాయగా అందులో ఎస్. ప్రియాంక 94.8, సీ. నిహారిక 89.01, ఆర్. హర్షిత 88.55, ఈ. భావన 87.5, బి. సాయినిధి 85.9, జీ.పల్లవి 80.8 ఉత్తీర్ణ శాతంతో విజయవం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. సుజాత, కార్యదర్శి అలుగు వర్షిని, సంయుక్త కార్యదర్శి సంతోషి, ఓఎస్‌డీ వివేకానంద, స్టేట్ ఆఫీసర్ ఎం.భీమయ్యలు విద్యార్థులను అభినందించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

గోల్కొండ: రాందేవ్‌గూడ మెయిన్ రోడ్డుపై అక్రమంగా వెలిసిన, ఫుట్‌పాత్‌లపై ఉన్న డబ్బాలను గురువారం తొలగించారు. బల్దియా వారు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు, గోల్కొండ లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో మెయిన్ రోడ్డుపై ఉన్న మసీదుల పక్కన రోడ్డుపై వెలిసిన పెద్ద పెద్ద డబ్బాలు, ఫుట్‌పాత్‌లపై ఉన్న టీ స్టాల్స్‌ను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఈ రోడ్డు ఆక్రమణలకు ఎంత మాత్రం సహించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.



గ్రీనరీ పనులు షురూ



గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్డులో అర్బన్ బయో డైవర్సిటీ అధికారులు గ్రీనరీ పనులు చేపడుతున్నారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి హెచ్‌సీయూ బస్ డిపో వరకు రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేస్తున్నారు. రెండున్నర కిలోమీటర్ల పొడవునా మొక్కలు నాటనున్నారు. ఐటీ కారిడార్‌లో ప్రధాన రహదారుల సుందరీకరణలో భాగంగా పనులు చేపట్టారు. బ్యూటిఫికేషన్ పనులు పూర్తైతే మరింత అందంగా కనిపించే అవకాశం ఉంది.

సమస్యలను పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పుప్పాలగూడ అంబేడ్కర్ భవన నిర్మాణం, శ్మశాన వాటిక దారి, నెక్నాంపూర్‌లో ఖబ్రస్తాన్‌కు స్థలం చూపటం పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు కోరారు. గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం మాట్లాడుతూ..పుప్పాలగూడలో 2019లో రూ.45 లక్షలతో అంబేడ్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అప్పటి నుంచి దాని గురించి పట్టించుకున్న వారే లేరన్నారు. పుప్పాలగూడ గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లేందుకు పాత దారి ఉండగా దాన్ని మూసివేశారని, తిరిగి తెరిపించాలన్నారు. నెక్నాంపూర్‌లో ముస్లింల ఖబ్రస్తాన్‌కు ఐదు ఎకరాల భూమి కేటాయించినా ఇప్పటి వరకు సర్వే చేసి హద్దులు చూపలేదన్నారు. ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, ఉపేంద్రనథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, రామసుబ్బారెడ్డి, ఆరీఫ్, సుమ నళిని తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హుడాకాలనీ వాసులు

శంషాబాద్: మౌలిక వసతులు కల్పించాలని హుడా కాలనీ వాసుల మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు కోరారు. ఈ మేరకు గురువారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హుడా కాలనీలో హెచ్‌ఎండబ్ల్యూస్ ఏర్పాటు చేసిన ట్యాంకు నిర్మాణం కోసం పెద్ద ఎత్తున రోడ్లను తవ్వి వదిలేయడంతో గోతులమయంగా మారిందన్నారు. రహదారులకు మరమ్మతులు చేయడంతో పాటు వంద గజాల లోపు ఉన్న గృహాలకు ఉచిత తాగునీటి సరఫరా చేయాలని కోరారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీ దోమలు, పందుల బెడద తీవ్రమై అనారోగ్యాల బారిన పడుతున్నామన్నారు.

గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


బేగంబజార్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. బేగంబజార్, ఫీల్‌ఖానా, మంగళ్‌హాట్ పూసల బస్తీలో, దత్తాత్రేయనగర్‌లో రోడ్ల నిర్మాణాల పనులు ఆయన కార్పొరేటర్ శంకర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధి కోసం ధూల్‌పేట్‌లోని తన కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్ మాట్లాడుతూ..బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలను ఇంటింటా అందించేందుకు కృషి చేస్తామన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను గురువారం ప్రారంభించారు. అర్చకుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వహించారు. ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, అంకురార్పణ, యాగశాల పూజలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు విష్వక్సేన ఆరాధనతో హోమం, రామ మూలమంత్రహవనం, సుందరకాండ హవనం,జలాధివాస హవనం, పూజలు నిర్వహిస్తారు. సోమవారం వరకు పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా నాగేశ్వరరావు



అత్తాపూర్: రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నాగేశ్వరరావు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన వెంకట్రాంరెడ్డి మల్టీ జోన్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ..విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాత ధోరని లేకుండా ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరిస్తూ బాధితులకు అండగా నిలుస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

- 'మనూ'లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశాలకు చివరి తేదీ ఫిబ్రవరి 17
- 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొ. వనజ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడ్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు ఫిబ్రవరి 17 ఆఖరుగా అని పేర్కొన్నారు. యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, స్కూల్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్‌లో అడ్మిషన్లు కల్పిస్తామని వివరించారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్: 6207728673, సాధారణ వివరాలకు: 9866802414, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సైన్సెస్, కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్: 9177461590, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ 8374346948 స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల లోపు సంప్రదించాలని ఆమె సూచించారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

చార్మినార్: రంజాన్ మాసంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ చార్మినార్ శాసన సభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆయనకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలు ప్రతిరోజూ ఉపవాసం ఉంటూ రోజుకు ఐదుసార్లు నమాజు చేస్తూ నిష్ఠగా ఉంటారన్నారు. దీంతో పాతబస్తీలోని అన్ని ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండే విధంగా అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించాలని ఆయన కోరారు. దారుషిఫా, పురానీహవేలీ, మీరాలంమండి చార్మినార్, మక్కా మసీదు, గుల్జార్‌హౌస్, మదీనా, పత్తర్‌గట్టి, పురానాపూల్, మూసాబౌలి తదితర ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలోని మసీదుల వద్ద చెత్త కుప్పలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విజేతలకు సన్మానం


విజేతలతో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: అండర్-14 బాలికల ఎలివెట్ 2025 విజేతలకు గురువారం సన్మానించారు. అఖిల భారత ఎలివెట్ 2025 అండర్-14 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో గోల్కొండ ఫుట్‌బాల్ టీమ్‌కు చెందిన అమ్మాయిలు విజేతలుగా నిలిచారు. బెంగళూరులో జరిగిన ఈ పోటీల విజేతలకు గురువారం గోల్కొండ ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ వారికి మెమెంటోలు అందజేసి అభినందించారు. ఇకనుంచి అండర్-14 విభాగంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఈ టీమ్‌ను తాము దత్తత తీసుకుంటున్నామన్నారు. టీమ్‌కు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించి తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ సఫ్దర్‌పాషాచే శిక్షణ ఇప్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంజేపీ డైరీ ప్రొడక్ట్స్ మెనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ విజేతలకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమీర్, ఫహాద్ తదితరులున్నారు.

ఐఎస్‌బీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

'బ్రైటెస్ట్ మైండ్స్ ఆఫ్ ఇండియా-2025'లో విజయసుందర్‌కు స్థానం

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం విజయసుందర్‌కు అరుదైన గౌరవం లభించింది. 'బిజినెస్ మింట్' ప్రకటించిన బ్రైటెస్ట్ మైండ్స్ ఆఫ్ ఇండియా-2025' టాప్-50లో ఆయనకు స్థానం కల్పించింది. ఐఎస్‌బీలో విజయసుందర్ బిజినెస్ ప్రాసెస్ ఎక్స్‌లెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఇన్ సర్వీసెస్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌ను బోధిస్తున్నారు. పలువురు ఐఎస్‌బీ ఫ్యాకల్టీ ప్రతినిధులు, ప్రొఫెసర్లు, డీన్, అధికారులు విజయసుందర్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ


ఇబ్రహీంబాగ్‌లో జెండాను ఆవిష్కరించిన యూనియన్ నాయకులు

మణికొండ: విద్యుత్ శాఖ కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి 1104 యూనియన్ అలుపెరగని పోరాటం చేస్తుందని సైబర్‌సిటీ సర్కిల్ రీజినల్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి అన్నారు. వారి యూనియన్ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఇబ్రహీంబాగ్ డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్‌లలో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ప్రెసిడెంట్ రామ్‌మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, ఆఫీసు సెక్రటరీలు గౌస్, రాజేశ్, ఇబ్రహీంబాగ్ డివిజన్ అధ్యక్షుడు రత్నం, సెక్రటరీ మూర్తి, నాయకులు శంకర్‌నాయక్, మధుసూదన్‌రెడ్డి, రాజు, రాఘవేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, యాదగిరి, మాణిక్యం, పుల్లయ్య పాల్గొన్నారు.